


జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

శుక్రవారం 29 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 361 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## ఫ్యూచర్ సిటీ ప్రపంచానికే తలమానికం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ నిర్మాణమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించిన మంత్రులు నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో ఫ్యూచర్ సిటీని ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు భవిష్యత్ తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవ తేదీలపై త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని, పలు కీలక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోందని, లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అవసరమైన నిర్ణయాలు తీసుకుని పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రులు నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె. శశాంక్, మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు రూపొందించాలి సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు' (యూనిఫైడ్ కార్డు) రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తక్షణమే అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో సీఎం ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని, ఏఐ సహాయంతో డేటాను విశ్లేషించడం ద్వారా సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని సీఎం తెలిపారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అనర్హులను గుర్తించడం సులభమవుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు జారీ చేసే విధానానికి బదులుగా ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఒకే సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సూచించారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యాశాఖ, బీమా పథకాలు తదితర వివరాలు ఈ కార్డులో పొందుపరచాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ తరహాలో ప్రత్యేక రాష్ట్ర యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇవ్వాలన్న ఆలోచనను కూడా ప్రస్తావించారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను ఈ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను కూడా సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే ఆ సమాచారం వెంటనే చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరేలా చర్యలు ఉండాలని, ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని సీఎం పేర్కొన్నారు. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, నైపుణ్యాభివృద్ధి, పాస్‌పోర్ట్, వీసా సమాచారాన్ని ఒకేచోట అందుబాటులో ఉంచితే అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉపయోగపడుతుందని సీఎం స్పష్టం చేశారు.

## ఇషా సింగ్ ఘనతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్-2026 షూటింగ్ పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి చారిత్రాత్మక విజయం సాధించిన హైదరాబాద్‌కు చెందిన షూటర్ ఇషా సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. జర్మనీ దేశంలోని మ్యూనిచ్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 43 హిట్స్ సాధించి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం భారత షూటింగ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ఇషా సింగ్ లక్షల మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆమె ప్రదర్శన భారత క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని, దేశ క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో ఇషా సింగ్ మరెన్నో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



## ఎన్టీఆర్ స్ఫూర్తితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశ చరిత్రను చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌లను స్మరించుకోవాలని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు ఎన్టీఆర్ కులాలు, మతాలు, భాషలకు అతీతుడని కొనియాడారు. తెలంగాణ నుంచి అనేక మంది నాయకులకు ఎన్టీఆర్ రాజకీయ భిక్ష పెట్టారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో ప్రతిష్ఠాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటు ప్రపంచ దిగ్గజ కంపెనీలను రప్పించే ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 3.24 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, అది ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలో బియ్యం పథకం స్ఫూర్తేనని పేర్కొన్నారు. ఎన్టీఆర్ అమలు చేసిన కూడు, గుడ్డ, నీడ పథకాల స్ఫూర్తితోనే ఇందిరమ్మ చీరల వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఆశీర్వాదం, ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రజాపాలనలో ప్రతిఫలిస్తోందని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు పార్లమెంట్‌లో మద్దతు ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఎన్టీఆర్ కుమారులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాలి దుమారానికి ఇల్లు కోల్పోయిన వృద్ధురాలికి తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 29, ప్రతినిధి: జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల బీభత్సానికి సర్వస్వం కోల్పోయి నిలువ నీడ లేక రోడ్డున పడిన వృద్ధురాలి పరిస్థితిపై రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చలించిపోయారు. మట్టంపల్లి మండలం పెద్దవీడు లాల్ తండా గ్రామానికి చెందిన తాళ్లూరి జయమ్మ నివాసం ఉంటున్న రేకుల ఇల్లు గాలి దుమారానికి పైకప్పు ఎగిరిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మంత్రి దృష్టికి చేరింది. వెంటనే స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో ఫోన్‌లో మాట్లాడి బాధితురాలికి తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని పేర్కొంటూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆమెకు ప్రకృతి వైపరీత్యాల కింద వెంటనే ఇల్లు మంజూరు చేయాలని సూచించారు. వృద్ధాప్యంలో ఆశ్రయం కోల్పోయిన బాధితురాలి సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి సూర్యాపేట కార్యాలయం ఈ ప్రకటనను విడుదల చేసింది.

## ఎన్టీఆర్ జననమే ఒక చరిత్ర : మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 29, ప్రతినిధి: విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు జననమే ఒక చరిత్ర అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి నామ నాగేశ్వరరావు నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతగా ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఆయన సాధించిన ఘనతలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. తెలుగు చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు, ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు చిరస్మరణీయమని అన్నారు. పటేల్–పట్వారీ వ్యవస్థ రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, పేదలకు గృహ నిర్మాణాలు వంటి పథకాలు సామాజిక న్యాయానికి నిదర్శనమని తెలిపారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజల చిరకాల కోరిక అని, ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం తాను చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఖమ్మంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలుగు జాతికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, బొల్లం మల్లయ్య యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్ కుమార్, ఆర్జేసీ కృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## ఉచిత ఆన్‌లైన్ విద్యను సద్వినియోగం చేసుకోండి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 29, ప్రతినిధి: యువత లక్ష్యంతో చదివి జీవితంలో రాణించాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి "రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ అందించాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ యాప్‌కు ఎనుగుల రాకేష్ రెడ్డి ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. నిపుణుల బోధనతో ఇంటి నుంచే మొబైల్ ద్వారా క్లాసులు వినే అవకాశం కల్పించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. తక్కువ ఖర్చుతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఈ యాప్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. బిట్స్ పిలానీ విశ్వవిద్యాలయం నుంచి విద్యాభ్యాసం పూర్తి చేసిన రాకేష్ రెడ్డి మంచి ఉద్యోగ అవకాశాలను వదులుకొని స్వగ్రామ అభివృద్ధికి కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్కరి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను సద్వినియోగం చేసుకొని ఉచిత ఆన్‌లైన్ విద్యను పొందాలని, పోటీ పరీక్షల్లో రాణించాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, బొల్లం మల్లయ్య యాదవ్, ఆర్జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## వడ్ల కొనుగోళ్లలో జాప్యంపై రైతుల రాస్తారోకో

సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 29, చిపచేడ్ మండల ప్రతినిధి: మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండలం చిట్కుల్ గ్రామంలో వడ్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున చేరుకున్న రైతులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాలకు లారీలు సమయానికి రాకపోవడం, కొనుగోలు ప్రక్రియ నెమ్మదిగా సాగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై వెళ్లే వాహనాలను అడ్డుకొని నిరసన చేపట్టడంతో రెండు నుంచి మూడు గంటల పాటు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. మండల ఎస్సై సమయానికి లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఎమ్మార్వోతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు నిరసన విరమించారు. వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని రైతులు కోరారు.

## సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి ప్రారంభ ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన టిమ్స్ ఆస్పత్రి ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య సేవలు, సౌకర్యాలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ డా. బీరప్ప తదితరులతో కలిసి ఆస్పత్రిలోని ప్రధాన విభాగాలను మంత్రి పరిశీలించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య అధికారులకు సూచించారు. ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందించే సేవలు, సిబ్బంది పనితీరుపై పలు సూచనలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నారాయణఖేడ్‌లో ఘనంగా లక్ష సుదర్శన మహాయాగం




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 29, ప్రతినిధి: నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని శ్రీ మహతి జ్యోతిష్యాలయంలో లోకకళ్యాణార్థం శ్రీ లక్ష సుదర్శన మహాయాగ క్రతువును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహాయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. యాగశాలలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన హోమ కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తాయి. శ్రీ మహంతి గురురాజ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాయాగం నిర్విఘ్నంగా కొనసాగింది. ప్రజల శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేకంగా లక్ష సుదర్శన మహాయాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

## సంగారెడ్డి కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా శ్రీహరి నియామకం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 29, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా సంగారెడ్డి పట్టణానికి చెందిన గంగిరెడ్డి శ్రీహరి ని నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ చేతుల మీదుగా శ్రీహరికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. శ్రీహరి నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## అందోల్ టిమ్స్ ఆస్పత్రిలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆకస్మిక తనిఖీ



సందేశం టైమ్స్, అందోల్, మే 29, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని టిమ్స్ ఆస్పత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు వార్డులను తనిఖీ చేసిన మంత్రి రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 29, ప్రతినిధి: సంగారెడ్డి మండలంలోని కులబ్‌గూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తూకం, తరలింపు, చెల్లింపుల విషయంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు నష్టం కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## హత్నూరలో వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్




సందేశం టైమ్స్, హత్నూర, మే 29, ప్రతినిధి: హత్నూర మండల పరిధిలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని స్వయంగా పరిశీలించిన ఆమె కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతోందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరిగితే రైతులు ఆర్థికంగా నష్టపోతారని పేర్కొంటూ ప్రతి రైతు ధాన్యాన్ని వేగంగా తూకం వేసి వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొన్ని కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతున్న పరిస్థితులను గమనించిన తహసీల్దార్ ధాన్యం రక్షణ కోసం తగిన టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యంపై కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాల్కల్‌లో ఘనంగా బక్రీద్ వేడుకలు



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 29, ప్రతినిధి: జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల కేంద్రంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే మసీదులకు భారీ సంఖ్యలో చేరుకున్న భక్తులు ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించి దేశంలో శాంతి, సామరస్యం, సుభిక్షం నెలకొనాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. పండుగ సందర్భంగా ముస్లిం పెద్దలు, యువకులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. మసీదుల పరిసరాలు ప్రార్థనలతో మారుమోగగా మండల కేంద్రం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. బక్రీద్ సందర్భంగా త్యాగం, మానవత్వం, సహనం అనే సందేశాలను మత పెద్దలు ప్రజలకు తెలియజేశారు. సమాజంలో ప్రేమాభిమానాలు పెరగాలని, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో జీవించాలని కోరారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. పండుగ వేళ స్థానిక ప్రజలు కూడా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సౌహార్ద వాతావరణాన్ని మరింత బలపరిచారు. న్యాల్కల్ మండలంలో బక్రీద్ వేడుకలు ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య ముగియడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం.. పేద కుటుంబంలో ఆనందం



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 29, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని మేడికుంద గ్రామానికి చెందిన ఉలిగెర బాలమణి, ఆమె భర్త కృష్ణ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడంతో గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కలగా ఎదురుచూస్తున్న తమ ఆశ నెరవేరిందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, వార్డ్ సభ్యులు విష్ణు రావు, పోచయ్య, సురేష్, పాపయ్య, బోయిని ప్రవీణ్, కోడూరి ప్రభు, డీలర్ బేతయ్య, బంగి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు క్రాంతి కుమార్ పాటిల్ శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, ఝరాసంగం, మే 29, ప్రతినిధి: పవిత్ర ఈద్-ఉల్-అదా (బక్రీద్) పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఝరాసంగం ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, నిస్వార్థానికి, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐకమత్యం మరింత బలపడాలని, ఇతరులకు సాయం చేసే గొప్ప మనస్తత్వాన్ని ఈ పండుగ పెంపొందించాలని కోరారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ “ఈద్ ముబారక్” అని తెలిపారు.



# బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాద్రి పృథ్వీరాజ్

సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 29, బి. డేవిడ్: త్యాగానికి, భక్తికి, సోదరభావానికి ప్రతీకగా జరుపుకునే పవిత్ర బక్రీద్ సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని మురాద్ అలీ షా దర్గా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి వారికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ త్యాగం, మానవత్వం, దైవభక్తికి నిదర్శనమని పేర్కొన్న పృథ్వీరాజ్ అన్ని మతాలు శాంతి, ప్రేమ, సోదరభావాన్నే బోధిస్తాయని తెలిపారు. ప్రజలంతా కలిసిమెలిసి సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్ రెడ్డి, బాయికాడి విజయ్, శ్రీధర్ చారి, ధనరాజ్ గౌడ్, గుండమొల్ల రాజు, వీరారెడ్డి తదితరులు, ముస్లిం సోదరులు మరియు వివిధ నాయకులు పాల్గొన్నారు.



# ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 29, ప్రతినిధి: పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముస్లిం సోదర సోదరీమణులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అని పేర్కొన్నారు. దైవాజ్ఞను అనుసరించి సమాజ హితం కోరి ప్రతి మనిషి నిస్వార్థ సేవలు అందించాలనే సందేశాన్ని బక్రీద్ పండుగ అందిస్తుందని తెలిపారు. తమకు కలిగిన దాంట్లో కొంతైనా ఇతరులతో పంచుకునే దాతృత్వ స్వభావాన్ని ఈ పండుగ ద్వారా అలవర్చుకోవాలని సూచించారు. అల్లా ఆశీస్సులతో ప్రజలు, రైతులకు సకాలంలో వర్షాలు కురిసి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా మైనార్టీ మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన మురళీధర్ యాదవ్




సందేశం టైమ్స్, నర్సాపూర్, మే 29, ప్రతినిధి: పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా నర్సాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ మైనార్టీ మిత్రులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్, మాజీ వైస్ చైర్మన్ నయీమ్, కౌన్సిలర్ షేక్ హుస్సేన్, హబీబ్ ఖాన్, మాజీ సర్పంచ్ పాండురంగ రెడ్డి తదితరులు మరియు మైనార్టీ మిత్రులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా ప్రశిక్షణ తరగతుల నిర్వహణపై సన్నాహక సమావేశం



సందేశం టైమ్స్, మెదక్, మే 29, ప్రతినిధి: బీజేపీ మెదక్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రశిక్షణ తరగతుల నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ప్రశిక్షణ తరగతులు మరుసటి రోజు 31వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ కట్ట సుధాకర్ రెడ్డి, ప్రశిక్షణ ప్రభారి బసవరాజు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సంగసని సురేష్, రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, సుభాష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, ఎంఎల్ఎన్ రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్, జిల్లా నాయకులు లోకేష్, వడ్ల జనార్ధన్, పంజా విజయ్, సుంకోజు రాజు, మండల అధ్యక్షులు శ్రీనివాస్, బీజేపీ నాయకులు సత్యం, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతున్నాయి: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 29, ప్రతినిధి: అకాల వర్షాల కారణంగా జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు అమలు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా కొనుగోళ్లు నిర్వహిస్తోందన్నారు. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు అకాల వర్షాల ప్రభావంతో తడిసిన సుమారు నాలుగు వేల క్వింటాళ్ల ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించి కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 62,103 మంది రైతుల నుంచి 2,85,054.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అలాగే 43,433 మంది రైతుల ఖాతాల్లో రూ.468.18 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు, వేగవంతమైన రవాణా ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, డీఆర్‌డీఓలు, డీసీఓలు, జీసీసీ ప్రతినిధులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని, పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు తమ సమస్యలు, సందేహాల పరిష్కారం కోసం జిల్లా సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 9391942254ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

జాతీయ తెలుగు దినపత్రిక

# సందేశం టైమ్స్

శుక్రవారం 29 మే 2026



## వేగంగా ధాన్యం అన్లోడింగ్ జరగాలి: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్, మే 29, ప్రతినిధి: ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గోడౌన్ నిర్వాహకులను ఆదేశించారు. కొల్చారం మండలంలోని వరిగుంటం గ్రామంలో ఏర్పాటు చేసిన గోడౌన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు, నిల్వ కోసం ఏర్పాటు చేసిన గిడ్డంగిని పరిశీలించి అక్కడి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సేకరించిన వరి ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం అన్లోడింగ్ త్వరగా పూర్తయ్యేలా లారీలు, లేబర్ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అన్లోడింగ్లో ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, హమాలీలను షిఫ్ట్ల వారీగా పని చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు





సందేశం టైమ్స్, మెదక్/అల్లాదుర్గం, మే 29, మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్: అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో ముస్లిం సోదరులు పవిత్ర బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్యాగం, సేవ, సహనం నేర్పించే మహోన్నత బక్రీద్ పండుగను మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలోని ఈద్గాలు, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏడాదికోసారి వచ్చే ఈ పవిత్ర పండుగను ఎంతో ఆధ్యాత్మికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరప్ప, ఉపసర్పంచ్ శ్రీకాంత్తో పాటు గ్రామ ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 29, ప్రతినిధి: రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఇసుక వాహనాలను కూడా ధాన్యం రవాణా, అన్లోడింగ్ కోసం వినియోగించాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి వరి దిగుబడి అద్భుతంగా వచ్చిందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షాన నిలుస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లు కట్టించింది మేం.. కూల్చింది మీరు: కేటీఆర్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: ఆత్మగౌరవ ఇళ్లు నిర్మించిన ఆత్మగౌరవ పార్టీ బీఆర్ఎస్దేనని K. T. Rama Rao పేర్కొన్నారు. సవాళ్లు చేయడం, తర్వాత వెనక్కి తగ్గడం కాంగ్రెస్ నేతలకు అలవాటైందని విమర్శించారు. 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని కాంగ్రెస్ నేతలు చెప్పారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకోవాలని సవాల్ విసిరారు. శపథాలు చేయడం కాదు, చేతనైతే చేసి చూపించాలని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఒక్కో గృహం ఏడు ఇందిరమ్మ ఇళ్లతో సమానమని తెలిపారు. ఇళ్లు నిర్మించింది తామైతే, వాటిని కూల్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని కేటీఆర్ ఆరోపించారు.

## ఫ్యూచర్ సిటీలో భూములకు రికార్డు ధరలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: రాజధాని పరిధిలోని ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో ప్రభుత్వ హౌసింగ్ బోర్డు భూములకు భారీ డిమాండ్ నెలకొంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలో నిర్వహించిన ఇ-ఆక్షన్లో చదరపు గజం భూమి గరిష్ఠంగా రూ.83,500 ధర పలికింది. ఎటువంటి వివాదాలు లేని క్లియర్ టైటిల్తో ప్రభుత్వ హౌసింగ్ బోర్డు భూములు ఉండటంతో పలువురు డెవలపర్లు పోటీ పడ్డారు. మొత్తం నాలుగు భూములకు నిర్వహించిన వేలం ద్వారా సుమారు రూ.140 కోట్ల ఆదాయం వచ్చినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. వెయ్యి నుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూములకు ఈ-ఆక్షన్ నిర్వహించగా సుమారు 17 సంస్థలు పోటీ పడ్డాయి. 1113 చదరపు గజాల భూమికి కనీస ధరగా రూ.26 వేలు నిర్ణయించగా పోటీ కారణంగా చదరపు గజం రూ.83,500కు అమ్ముడైంది. అలాగే 6 వేల చదరపు గజాల విస్తీర్ణంలోని మరో భూమి చదరపు గజం రూ.62,500 ధరకు విక్రయమైంది. 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు తీవ్ర పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు భారీ ఆదాయం సమకూరింది. మరోవైపు కేపీహెచ్బీ కాలనీ, కుత్బుల్లాపూర్ చింతల్ ప్రాంతాల్లోని నాలుగు ప్లాట్లకు శుక్రవారం ఇ-ఆక్షన్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కేపీహెచ్బీ ఫేజ్-1, ఫేజ్-2లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల స్థలాలు, కుత్బుల్లాపూర్ చింతల్లోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను వేలం ద్వారా విక్రయించనున్నారు.



## టిమ్స్ సనత్నగర్ ఆస్పత్రి ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 29, ప్రతినిధి: సనత్నగర్లో నిర్మితమవుతున్న టిమ్స్ ఆస్పత్రి ప్రారంభానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించి ఆధునిక వైద్య పరికరాలు, వైద్య సదుపాయాలు, లాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మౌలిక వసతులను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రిలో జరుగుతున్న సివిల్ వర్క్సను శరవేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ల కోసం ప్రత్యేకంగా బాలుర, బాలికల హాస్టల్ బ్లాక్స్ ఏర్పాటు చేయాలని, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్లకు తగిన టాయిలెట్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మల్టీ లెవెల్ పార్కింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రోగుల సహాయకుల కోసం ధర్మశాల, రెండు క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరిపాలన భవనం, టీబీ హాస్పిటల్ బోర్డు కార్యాలయ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ, శానిటేషన్, వాటర్ సప్లై సేవలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో అధునాతన ఇంటీరియర్స్, లాంజ్లు ఏర్పాటు చేయాలని, విదేశీ రోగుల కోసం ప్రత్యేక బ్లాక్స్లో ఆధునిక సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి లాబొరేటరీ ఏర్పాటుపై డీఎంఈ, హెచ్ఓడీలు, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. టిమ్స్ ఆస్పత్రిని పూర్తి స్థాయిలో ప్రారంభించేందుకు అవసరమైన పనులను వేగవంతం చేసి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రతిపాదిత పరిపాలన భవనంలో ఆస్పత్రి నిర్వహణ, మెరుగైన వైద్య సేవల కల్పన, సివిల్ వర్క్స్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో రాష్ట్ర వైద్య ఆరోగ్య ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎండీ హనుమంతు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బి శాఖ ఇంజనీరింగ్ అధికారులు రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొలి హైడ్రోజన్ రైలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 29, ప్రతినిధి: దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపట్ మార్గంలో ఈ వినూత్న రైలును ప్రవేశపెట్టనున్నారు. 10 బోగీలతో కూడిన ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనుంది. హైడ్రోజన్ మరియు ఆక్సిజన్ కలయికతో విద్యుత్ ఉత్పత్తి చేసే సాంకేతికత ఆధారంగా ఈ రైలు పనిచేయనుండటంతో పర్యావరణ పరిరక్షణకు ఇది ఎంతో మేలు చేయనుంది. కాలుష్యాన్ని తగ్గించే గ్రీన్ టెక్నాలజీ వైపు భారత రైల్వే కీలక అడుగు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే పలు సాంకేతిక ధ్రువీకరణలు, భద్రతా పరీక్షలు పూర్తయిన అనంతరమే ఈ హైడ్రోజన్ రైలును ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.